

## యం.ఐ. కిషన్

"చివరికి మీరు నన్నిలా మోసం చేస్తారని అనుకోలేదు" కౌసల్య కంఠంలో నిష్టూరతకన్నా ఆవేదనే ఎక్కువగా ధ్వనించింది.

రమణమూర్తి తల భూమిలోకి కృంగిపోయింది. "నన్ను మన్నించు కౌసీ!" అన్నాడు అతికష్టంమీద గొంతు పెగల్చుకుంటూ.

కౌసల్య ఏదో అనబోయింది. ఈలోగా రమణమూర్తే అన్నాడు మళ్ళీ. "నిజం కౌసీ... నన్ను నమ్ము. కల్లో కూడా నేనేనాడూ నీకు ద్రోహం చెయ్యాలనుకోలేదు. అలాంటిది ఆ సమయంలో ఎందుకలా ప్రవర్తించానో నాకే తెలియదు"

"నేను చెప్పనా?" ఒక్క క్షణం వ్యవధినిచ్చి అన్నది కౌసల్య "ఈ ప్రపంచంలో ఏ మగవాడూ శ్రీరామచంద్రుడు కాదు గనుక!"

అలాగని సరిపెట్టుకుంటే ఎంత బావుణ్ణు. ఈ రాద్ధాంతం అంతా లేకుండా! అనుకున్నాడు రమణమూర్తి. కానీ అదే మాట పైకనడానికి అతనికి ధయిర్యం చాల్లేదు. కనీసం దించిన తలని పైకయినా ఎత్తలేకపోయాడు.

వాలకాన్నిబట్టే అర్థం చేసుకొంది కౌసల్య. అతనింకేమీ మాట్లాడడని. కాదు... మాట్లాడలేడని.

చెయ్యకూడని తప్పు చేసేసి క్షమించమని ఒక్క మాటనగానే సరిపోతుందా? ఒకవేళ అలాంటి తప్పే తనుగనక చేస్తే... చేసి క్షమించమంటే అతనైతే క్షమించేయగలడా?

నెవ్వర్!

ఆ క్షణంలో ఎందుకలా ప్రవర్తించానో నాకే తెలియదంటే ఏమన్న మాటది? చేసిన తప్పుకి ఏ రకంగా సంజాయిషీ అవుతుందది?

మగవాడైనంత మాత్రాన నీతి ఉండనక్కర్లేదా?

నో... ఈ విషయాన్నిలా వదిలిపెట్టడానికి వీల్లేదు! అనుకొంది కౌసల్య.

"సరే... ఇంతకీ ఇప్పుడు మీరేం నిర్ణయించుకున్నారు?"

రమణమూర్తికి అర్థం కాలేదు కౌసల్య ప్రశ్న. అతికష్టంమీద తల పైకెత్తి "అంటే?" అన్నట్లుగా చూశాడు. చూసి అంతలోనే మళ్ళీ తల దించుకున్నాడు.

"ఊ... మాట్లాడరేం?" రెట్టించింది కౌసల్య.

"ఏం మాట్లాడమంటావ్?... మళ్ళీ మళ్ళీ అడుగుతున్నాను. నన్ను క్షమించు. నువ్ క్షమిస్తే అన్నీ సర్దుకుపోతాయ్!"

"సమయానికి నేను రాబట్టి జరగాల్సిన అనర్థం పూర్తిగా జరక్కుండా మధ్యలో ఆగిపోబట్టి మీరీ మాట అనగలుగుతున్నారు. అదే నేనే రావడంగనక ఇంకో పది నిమిషాలాలస్యమయ్యుంటే ఈ పాటికి దాని జీవితం సర్వనాశనమై పోయుండేది. అప్పుడేం చేసుండేవారు?"

"... ..."

"అప్పుడు కూడా నేను క్షమిస్తే అన్నీ సర్దుకుపోయుండేవా?"

కౌసల్య అలా అడుగుతుంటే ఒకేసారి పది, పన్నెండు పిడిబాకుల్ని గుండెల్లో పొడిచి వెనక్కి లాగుతున్నట్లుగా అనిపించింది రమణమూర్తికి. నరకయాతనంటే ఇదేనేమో అనుకున్నాడు మనసులో.

"మంగా ఓ సారిలా రా!" పిలిచింది కౌసల్య.

గుమ్మందాకా వచ్చిన మంగ భయపడుతూ గడపకవతలే నించుండి పోయింది.

"ఫర్వాలేదులే రా. నీకేం భయం లేదు. ఇలాగొచ్చి మీ అయ్యగారి ముందు నుంచో!"

చెబుతున్నది ఎంత యజమానురాలైతే మాత్రం లేడిపిల్ల వచ్చి పులిముందు నిలబడగలదా?

అక్కడ్నుంచి కదల్లేదు మంగ.

"ఫర్వాలేదులే రావే!" మరోమారు చెప్పి చూసింది. కానీ లాభం లేకపోయింది.

ఇలాక్కాదు లెమ్మని తనే లేచివెళ్ళి ఆమెను తోడ్కొని వచ్చి భర్తముందు నిలిపింది కౌసల్య. మలేరియా జ్వరం వచ్చినదానికిమల్లే ఆమె గజగజా వణికిపోతుంటే తానే ఆమెకు చేయూతనిచ్చింది.

"ఊ... ఒక్కసారి దీనికేసి చూడండి. దీని వయసెంతుంటుందో చెప్పగలరా? మహాఅయితే పదహారుంటాయేమో! మన లావణ్య దీనికన్నా ఎంత చిన్నదంటారు?... ఓ మూడేళ్లు!... అలాంటి దీన్లో... మీకు కూతురు కనిపించాల్సింది పోయి... ఛీ!... మీరూ ఒక మనిషేనా?... మీదీ ఒక జన్మేనా?..." ఉద్రేకంతో మనిషి నిలువెల్లా కంపించి పోసాగింది కౌసల్య.

అక్కడ ఉండడం తనకి అసాధ్యమనిపించింది రమణమూర్తికి. లేచి వెళ్లిపోబోయాడు.

"ఆగండి!" అరిచింది కౌసల్య.

"మీకు దీనిమీద అంత మోజున్నప్పుడు నేనెందుక్కాదనాలి. మీరు దీన్ని పెళ్లి చేసుకుంటానంటే చెప్పండి నేను మైసమ్మతో మాట్లాడతాను..."

"అమ్మగారూ!" భయంగా అన్నది. కాదు... అరిచింది మంగ.

"నీకేం భయంలేదు నువ్వుండవే" అన్నట్లుగా ఆమె భుజంమీద తట్టింది కౌసల్య. "ఊ. చెప్పండి?" అంటూ రెట్టించింది భర్తని.

ఇంక తప్పదనుకుని గొంతు విప్పాడు రమణమూర్తి. "నన్ను నమ్ము కౌసల్యా. తాత్కాలికంగా ఏదో ఆవేశానికి లోనై మంగమీద చెయ్యేశాను. అంతేగానీ నాకు తనపట్ల ఏ మోజూ లేదు. ప్లీజ్... ఈ విషయాన్ని ఇంతటితో విడిచిపెట్టు. జరిగిన సంగతి అందరం మరిచిపోదాం. మంగా... దయచేసి నువ్వు కూడా నన్ను క్షమించు. ఈ సంగతి మీ అమ్మతో చెప్పొద్దు. ఇంకెప్పుడూ నీవంక కన్నెత్తయినా చూడను. ఇలా జరిగిందని పని మానెయ్యబాకు. రేపట్నుంచి మళ్లీ మామూలుగానే పనిలోకి రా!" అన్నాడు ఇద్దర్నీ ఉద్దేశిస్తూ వేడికోలుగా.

కదుపు చించుకుంటే కాళ్లమీద పడుతుందని ఓ సామెత.

ఎంతైనా కౌసల్య ఆడది. భర్త చేసింది సహించలేని నేరమే అయినప్పటికీ సహించక చేసేదేముంది? ఆ కారణంగా తన సంసారాన్ని చిన్నాభిన్నం చేసుకోలేదు కదా?

అంతటితో ఊరుకోక తప్పలేదు కౌసల్యకి.

* * *

వారం తర్వాత ఒకరోజు. సాయంత్రం మూడు గంటలవేళప్పుడు... రమణమూర్తి ఇంట్లో...

"ప్లీజ్ మంగా... మరొక్కసారి..." అని మంగని గెడ్డం పుచ్చుకుని బతిమాలుతున్నాడు రమణమూర్తి.

మంగ కళ్లలో భయం. "వద్దయ్యగారూ... ఆ రోజులా మళ్లీ అమ్మగారికి దొరికిపోతామేమో..."

"ఆ రోజంటే మీ అమ్మగారు పొరపాట్న ఆఫీసునుండి పెందలాడే రావడంవల్ల అలా జరిగిందికానీ ఎప్పుడూ అలానే జరుగుతుందా?... ప్లీజ్ మంగా... ఒక్కసారంటే ఒక్కసారే! ఒకే ఒక్కసారి..."

ఆ రోజు రమణమూర్తికి డే ఆఫ్. అతని డే ఆఫ్ వచ్చినప్పుడల్లా ఆ ఇంట్లో ఎప్పుడూ జరిగే తతంగమే అది.

అయిష్టతని నటిస్తూనే అతనికి లొంగిపోయిన మంగ "ఆరోజు అదాట్టుగా అమ్మగార్ని చూసేసరికల్లా... భయమేసిపోయి... అలా కేకలు పెట్టేశాను. నామీద మీకు కోపం రాలేదా అయ్యగారూ?" అని అడిగింది అతని కౌగిట్లో ఒరిగిపోతూ.

అయిష్టతని నటిస్తూనే అతనికి లొంగిపోయిన మంగ "ఆరోజు అదాట్టుగా అమ్మగార్ని చూసేసరికల్లా... భయమేసిపోయి... అలా కేకలు పెట్టేశాను. నామీద మీకు కోపం రాలేదా అయ్యగారూ?" అని అడిగింది.

''ఇంకా నయం. నువ్వలా తెలివిగా ప్రవర్తించుండక పోతే మన గుట్టు ఆనాడే రట్టయిపోయుండేది! అసలారోజు నిన్ను పని మానెయ్యమంటుందేమో మీ అమ్మగారని నేనెంత భయపడ్డానో తెలుసా?'' అంటూ ఆమెని ఎదలోకి అదుముకున్నాడు రమణమూర్తి.

''తెలియదు!''

—మంగ కంఠం కాదది. కౌసల్య కంఠం.

అంతే! వాళ్ళిద్దరూ నెత్తిమీద పిడుగులు పడినవారిలా బిగుసుకుపోయారు. ఆ క్షణాన్ని కౌసల్య నోటివెంబడి వెలువడిన ''ఛీ!''త్కారానికే గనుక శక్తి ఉండుంటే వాళ్ళిద్దర్నీ దహించివేసి ఉండేదేమో!

*

